సాక్షి
రంగారెడ్డి
శనివారం । 1 । జూన్ । 2024



వెంచర్ ధ్వంసంపై కేసు

వెంచర్‌ను ధ్వంసం చేసిన ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశారు. 10లో▸



ఐదుగురికి రిమాండ్

రైతులను లక్ష్యంగా చేసుకొని నకిలీ విత్తనాలు విక్రయించి కాసులు దండుకొనే ముఠాపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. 10లో▸



ధైర్యంగా ఎదుర్కోవాలి

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి



అన్మాస్‌పల్లిలో చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న చుక్కా రామయ్య

ఆమనగల్లు: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలవాలని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య ఆకాంక్షించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలోని శ్రీ రామేశ్వర వీరాంజనేయస్వామి దేవాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్ఞాన సరస్వతి మందిరంలో పలువురు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా చుక్కా రామయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, చదువు చెప్పిన గురువులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావ్, మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

షాద్‌నగర్: ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎన్‌పీఆర్‌డీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చి ఎనిమిదేళ్లు అవుతున్నా నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక దివ్యాంగుల కోసం ప్రత్యేక హోమ్స్‌ను నిర్మించాలని, కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందజేస్తున్న రూ.300 పెన్షన్ పెంచాలని, కేంద్ర ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, దివ్యాంగులపై వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్ల సాధనలో భాగంగా జూలై 23, 24 తేదీల్లో జిల్లా తృతీయ మహాసభలను షాద్‌నగర్ పట్టణంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ డివిజన్ ఎన్‌పీఆర్‌డీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా నర్సింలు, గౌసియా బేగం, శివలీల, కార్యదర్శిగా సంతోష, సహాయ కార్యదర్శులుగా శివరాములు, కల్పన, కుసుమ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌గౌడ్, నాగార్జున, శ్రీనివాస్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



ఓ హోటల్‌లో నిల్వ ఉంచిన మాంసాన్ని పడేయిస్తున్న అధికారులు

షాద్‌నగర్: పట్టణంలోని పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఉన్న పాలేగారి, కృతుంగ, శ్రీను హోటళ్లపై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. హోటళ్లలో వంట గదులను పరిశీలించారు. నిల్వ ఉంచి మాంసాన్ని, కాలం చెల్లిన పాలు, పెరుగును పారబోశారు. అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లపై కేసులు నమోదు చేసినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు.

ఎన్‌ఓసీ.. ఇచ్చేసెయ్!

చేయి తడిపితే చాలు వెంచర్లకు అనుమతులు

- నిరభ్యంతర పత్రాల జారీకి రూ.లక్షల్లో వసూలు
- జిల్లా నీటిపారుదల శాఖలో పెచ్చుమీరిన అవినీతి
- తాజాగా ఏసీబీకి చిక్కిన నలుగురు అధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్త వెంచర్లు, భవన నిర్మాణాలకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇచ్చేందుకు జిల్లా నీటి పారుదలశాఖ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. చేయి తడపనిదే ఫైలు ముందుకు కదలని పరిస్థితి. ఇటీవల హైదరాబాద్ నగర యూనిట్‌కు చెందిన డీఈఈ పవన్ కుమార్ రూ.4 లక్షలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడగా, తాజాగా రంగారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ ఏఈలు నికేష్, కార్తీక్, ఈఈ బన్సీలాల్ సహా మరో అధికారి ఏసీబీకి పట్టుబడటాన్ని పరిశీలిస్తే ఆ శాఖలో అవినీతి ఏ మేరకు పేరుకు పోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఆ నిబంధనే వారికి వరం

కొత్త వెంచర్లు వేయాలన్నా.. ఆ వెంచర్లలో కొనుగోలు చేసిన ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణాలు చేపట్టాలన్నా.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి అనుమతి తప్పనిసరి. ఇందుకు ఆయా స్థలాల్లో ఎలాంటి ప్రభుత్వ సర్వే నంబర్లు కానీ, వివాదాస్పద భూములు కానీ లేవని రెవెన్యూ అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఇక నీటి కుంటలు, చెరువులు, బఫర్ జోన్లు, శిఖం పట్టా భూములు లేవని నిర్ధారిస్తూ జిల్లా నీటి పారుదలశాఖ నుంచి నిరభ్యంతర పత్రం పొందాల్సి ఉంది. దీన్ని అవకాశంగా తీసుకుంటున్న సంబంధిత శాఖల అధికారులు చిన్నచిన్న లోపాలను సాకుగా చూపించి, రియల్టర్ల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. వెంచర్ చేస్తున్న ప్రాంతం, భవనం నిర్మిస్తున్న ప్రాంతాన్ని బట్టి ఆయా ఫైళ్లకు ధర నిర్ణయిస్తున్నారు. క్షేత్రస్థాయిలోని పొజిషన్‌తో సంబంధం లేకుండా ఇరిగేషన్‌శాఖ ట్రోపోషీట్ ప్రకారం నిర్ణయాలు తీసుకుంటున్నారు. కళ్లముందే వర్షపు నీరు వరదై పారుతున్నా..అడిగినంత ముట్టజెబితే చాలు పట్టించుకోలేదనే విమర్శలు లేకపోలేదు.

అడ్డగోలుగా జారీ..

జిల్లా నీటిపారుదలశాఖను ఐదు డివిజన్లుగా విభజించారు. ఒక్కో డివిజన్‌కు ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సహా డీఈ, ఐదుగురు ఏఈలను నియమించారు. నీటి వనరులను సంరక్షించాల్సిన వీరంతా అక్రమార్జనకు అలవాటు పడి, రియల్టర్లతో కలిసిపోయారు. చెరువులు, వాగులు, వంకలు, బఫర్ జోన్లు, శిఖం భూములు పట్టించుకోకుండా అడ్డగోలుగా నిరభ్యంతర పత్రాలు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం 2,127 చెరువులు, కుంటల వరకు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా చెరువుల్లోని మెజార్టీ భూములు ఇప్పటికే కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, రావిర్యాల చెరువు, ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు, తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు, ఈసీ, మూసీ, వాగుల బఫర్‌జోన్లలో భారీగా వెంచర్లు పుట్టుకొచ్చాయి. శంషాబాద్ నుంచి మొయినాబాద్‌కు వెళ్లే మార్గం అమ్డాపూర్‌లో కల్వర్టు కింద కూడా వెంచర్ల ఏర్పాటుకు ఎన్‌ఓసీలు జారీ చేశారు. ఇక హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, బాలాపూర్, రాజేంద్రనగర్, నార్సింగి, మణికొండ, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లోని చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలకు అడ్డగోలుగా ఎన్‌ఓసీలు జారీ చేశారు. ఫలితంగా ఆయా చెరువులు, కుంటలు ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి తలెత్తింది.

ఏసీబీకి చిక్కిన అధికారులు



ఏసీబీకి పట్టుబడ్డ అధికారులు

నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈలు సహా ఓ మండల సర్వేయర్ ఏసీబీకి పట్టుబడ్డారు. నిర్మాణాలకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేసేందుకు దరఖాస్తుదారు నుంచి రూ.2.50 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో సదరు దరఖాస్తుదారు ఏసీబీని ఆశ్రయించగా గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత రెడ్‌హిల్స్‌లోని రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ ఆఫీసులో తనిఖీలు నిర్వహించి, అక్రమార్కులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం వారిని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పర్చగా, న్యాయస్థానం వారికి రిమాండ్ విధించింది. నెక్నాంపూర్‌కు చెందిన బొమ్మ నరేంద్రనాథ్‌రెడ్డికి స్థానికంగా కొంత భూమి ఉంది. నిర్మాణానికి ఇరిగేషన్ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి కావడంతో ఆయన ఇటీవల నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్‌ఓసీ జారీకి రంగారెడ్డిజిల్లా ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్ కె.కార్తీక్, ఎస్‌ఈ ఆఫీసులోని ఏడబ్ల్యూ సెక్షన్ ఏఈ హెచ్.నికేష్ కుమార్ రూ.2.50 లక్షలు డిమాండ్ చేశారు. గండిపేట మండల సర్వేయర్ పి.గణేశ్ రూ.40 వేలు డిమాండ్ చేశారు. చివరికి వీరందరికీ రూ.1.50 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారు. నిజానికి దరఖాస్తుదారుని భూమిలో నాలా ఆనవాళ్లు లేకపోయినప్పటికీ ఎన్‌ఓసీ జారీకి డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో అవినీతిపరులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు. రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు ఇరిగేషన్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ అవినీతిలో మరెంత మందికి భాగస్వామ్యం ఉందనే కోణంలో విచారణ జరుపుతున్నారు. అధికారులు కూడబెట్టిన ఆస్తులపై కూడా ఆరా తీస్తున్నారు.



ఓ ఫర్టిలైజర్ షాపులో పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, చిత్రంలో జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి తదితరులు

జిల్లాలో విత్తనాల కొరత లేదు

- ప్యాకింగ్ లేకుండా లూజుగా విక్రయిస్తే చర్యలు
- ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలి
- వివరాలు నమోదు చేయాలి
- కలెక్టర్ శశాంక

మొయినాబాద్: రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను ఫర్టిలైజర్ షాపుల్లో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ శశాంక అన్నారు. మొయినాబాద్‌లోని బాలాజీ ఫర్టిలైజర్ షాపును శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో విక్రయిస్తున్న పత్తి విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, బిల్లులు, ఈపాస్ మిషన్లను పరిశీలించి స్టాక్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన పత్తి, వరి, మొక్కజొన్న, కంది వంటి అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విత్తనాలు విక్రయించాలన్నారు. ఏయే విత్తనాలు, ఎరువులను ఏయే రైతులకు విక్రయిస్తున్నారో వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ప్యాకింగ్ లేకుండా లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితిల్లో విక్రయించొద్దన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులను ఈపాస్ మిషన్ ద్వారానే విక్రయించాలన్నారు. జిల్లాలో విత్తనాల కొరత లేదని.. అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. విత్తనాలు, ఎరువులకోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరానికి సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు సైతం సరఫరా అవుతున్నాయన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఏఓ రాగమ్మ, ఆర్‌ఐ చంద్రమోహన్, ఏఈఓ సునీల్ తదితరులు ఉన్నారు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను సకాలంలో అందించాలని కలెక్టర్ శశాంక అన్నారు. మొయినాబాద్ మండలం చిలుకూరులోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. స్వయం సహాయక సంఘం మహిళలు కుడుతున్న స్కూల్ యూనిఫాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభం కావడానికి ముందే యూనిఫాంలు స్కూళ్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మహిళలతో మాట్లాడి రోజుకు ఎన్ని యూనిఫాంలు కుడుతున్నారు.. ఇప్పటి వరకు ఎన్ని కుట్టారు.. ఇంకా ఎన్ని కుట్టాల్సి ఉంది అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యతతో యూనిఫాంలు కుట్టేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఏపీఎం రవీందర్, ఆర్‌ఐ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మండల సమాఖ్య సభ్యులు అశ్విని, అనిత, జియ, స్వప్న, సీసీ మంజుల తదితరులు ఉన్నారు.

బాలికకు అబార్షన్

నిందితుడికి రిమాండ్

చేవెళ్ల: మైనర్‌ను గర్భవతిని చేసిన వ్యక్తిపై రేప్, పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ కేసులో పోలీసులు శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కె.సుదర్శన్ ఇంటి సమీపంలోని 17ఏళ్ల బాలికతో చనువుగా ఉంటూ కారులో పాఠశాలలో దింపేవాడు. ఈ క్రమంలో నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు. ఇటీవల బాలిక అనారోగ్యంగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా గర్భం దాల్చిందని తెలిసి అబార్షన్ చేయించారు. మోసపోయానని గుర్తించిన బాలిక ఇటీవల చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పోలీసులు సుదర్శన్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

ఉపాధి పనులు భేష్

అభినందించిన కేంద్రబృందం సభ్యులు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

యాచారం: కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా చేపడుతున్న గ్రామీణ ఉపాధి పనులు బాగున్నాయని, కూలీలకు చేతినిండా పని కల్పించే విషయంలో స్థానిక అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల బృందం అభినందించింది. మండల పరిధిలోని నస్దిక్‌సింగారం, చింతపట్ల, గడ్డమల్లయ్యగూడ గ్రామాల్లో శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన అరవింద్‌కుమార్, కిరణ్ చరణ్ పండే, కిరణ్‌మల్లే, హన్సల్‌సూథర్, పంకజ్‌రాణా, అమిత్‌కుమార్, శివంలోహిణి పర్యటించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి చేతినిండా పని కల్పిస్తున్నారా.. చేసిన పనులకు సకాలంలో బిల్లులు అందుతున్నాయా. జాబ్ కార్డులు అందజేస్తున్నారా.. పే స్లిప్పులు ఇస్తున్నారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీల వద్దకు చేరుకుని ఈజీఎస్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ నర్సింహులు, డీఆర్‌డీఓ శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీఓ శుభాషిణి, ఏపీడీ సక్రియా, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీఓ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

విత్తనం.. సిద్ధం

వానాకాలం సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని చదును చేసుకునే పనుల్లో ఉన్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. పంటల సాగు కోసం అవసరమైన విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఈఏడాది పత్తి పంటకు బాగా డిమాండ్ కనిపిస్తోంది. రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. డిమాండ్‌ను బట్టి కావాల్సిన విత్తనాలు తెప్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

– చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/మహేశ్వరం

- వానాకాలం సాగుకు రైతులు రెడీ
- దుక్కులు దున్ని చదును చేసుకుని..
- వర్షాల కోసం ఎదురుచూపులు
- విత్తనాల కొరత లేదంటున్న వ్యవసాయాధికారులు



ఆమనగల్లులో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

చేవెళ్ల డివిజన్‌లో ..

చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల్లో రైతులు వానాకాలంలో సాగు చేసే పంటల అంచనాలు.. కావాల్సిన విత్తనాలపై అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. 35,920 ఎకరాల్లో పత్తి సాగవుతుందని, దీనికి గాను 1,00,116 పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు. వివిధ కంపెనీలకు సబంధించిన 1,74,646 పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. 7,696 ఎకరాలల్లో మొక్కజొన్న సాగుకు 61,569 బస్తాల విత్తనాలు అవసరం ఉన్నట్లు భావిస్తున్నారు. 6,784 ఎకరాల్లో కంది సాగుకు గాను 20,352 ప్యాకెట్ల విత్తనాలు అవసరమని అంచనాలు సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. సీడ్స్ దుకాణాలను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి సమస్యలు లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులైన జనుములు, జీలుగ విత్తనాలు అందించింది. డివిజన్‌లో 922 క్వింటాళ్ల జనుములు, 167.2 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించారు. పత్తి ప్యాకెట్‌పై ఈఏడాది రూ.54 ధర పెరిగింది. వ్యవసాధికారులు, విజిలెన్స్ టీమ్‌లు నిరంతరం విత్తనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ నిత్యం విత్తన కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు మండలంలో పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. అవసరమైన విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సరిపడా పత్తి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారులు వివరించారు. మండలంలో గత ఏడాది 7 వేల ఎకరాల్లో పత్తి సాగు కాగా ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వపరంగా ఇప్పటికే 8 క్వింటాళ్ల జనుము, 8 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందించారు. మరికొన్ని జనుము, జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వ్యాపారుల నుంచి రైతులు కొనుగోలు చేస్తున్న విత్తనాలకు రసీదులు తీసుకుంటున్నారు. కల్తీ విత్తనాలు నివారించడానికి అధికారులు ఫర్టిలైజర్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మహేశ్వరం, కందుకూరులో..

మహేశ్వరం, కందుకూరు మండలాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఎరువులు, విత్తనాల దుకాణాల్లో రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. 17 వేల ఎకరాల్లో వరి, 425 ఎకరాల్లో కంది, 4,530 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేస్తున్నారు. ఎరువుల దుకాణాల్లో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రైతులకు రసీదులు అందజేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల అమ్మకాలపై అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రతి రోజు ఒకటి, రెండు ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీ చేస్తున్నారు. విత్తనాల కొరత ఏమీ లేదని స్పష్టం చేశారు.

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో..

ఇబ్రహీంపట్నం మండలంలో 5,800 ఎకరాల్లో వరి, మంచాల మండలంలో 9,500 ఎకరాలు, యాచారం మండలంలో 5000 ఎకరాలు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 5,200 ఎకరాల్లో వరి సాగు చేయొచ్చనే అంచనాతో వ్యవసాయాధికారులు ఉన్నారు. పత్తి పంట మాత్రం ఒక్క మంచాల మండలంలోనే 3 వేల ఎకరాల్లో, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలు కలిపితే 1,200 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. కంది సాగు డివిజన్ పరిధిలో కేవలం 600 ఎకరాల లోపు సాగు కానుంది. ఇప్పటి వరకు రైతులు 16 క్వింటాళ్ల వరకు జనుము, జీలుగ విత్తనాలు కొనుగోలు చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో 8 క్వింటాళ్లు, యాచారం, మంచాల మండలాల్లో 4 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. వర్షాలు కురిస్తే మరో 19 క్వింటాళ్ల మేర అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. వరి, పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో రైతులు ఇంకా కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. జూన్ రెండో వారం తర్వాతే వరి విత్తనాలు వేయనున్నారు. ఈ మేరకు ఫర్టిలైజర్ దుకాణాల్లో వాటిని అందుబాటులో ఉంచారు.

ఈ ఏడాది పత్తి సాగు



ఈఏడాది పత్తి సాగు చేసేందుకు పొలం చదును చేసి సిద్ధంగా ఉంచాను. వర్షాలు పడితే విత్తనాలు వేస్తాను. ప్రస్తుతం విత్తనాలకు ఎలాంటి ఇబ్బంది కనిపించడం లేదు. ఉంటే ముందుగానే కొని పెట్టుకుంటాను.

– గోపాల్‌రెడ్డి, రైతు, మల్కాపూర్

రసీదులు ఇస్తున్నారు



ఇబ్రహీంపట్నంలోని ఫర్టిలైజర్ షాపులో వరి విత్తనాలు కొనుగోలు చేశాం. రసీదు ఇచ్చారు. వర్షాభావంతో విత్తనాలకు ఇంకా గిరాకీ లేదు. బోర్ల కింద ఉన్న కొద్ది పాటి నీళ్లతో వరి పంట సాగు చేసేందుకు విత్తనాలు కొనుగోలు చేశాం.

– బుగ్గరాములు, రైతు, ఆరుట్ల

అవగాహన కల్పించాం



అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కొరత ఎక్కడా లేదు. రైతుల డిమాండ్‌ను బట్టి ఆయా కంపెనీల విత్తనాలు తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు ఒకే రకం విత్తనాలు కాకుండా నాణ్యమైన పలురకాలు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాం.

– రమాదేవి, ఏడీఏ, చేవెళ్ల

ప్రత్యేక బృందాలతో తనిఖీలు



ఎరువులు, విత్తనాల కొరత సృష్టించకుండా ప్రత్యేక టీమ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక బృందం ఈ తనిఖీలు చేపడుతోంది. ఎప్పటికప్పుడు ఎరువులు, విత్తనాల బెడద తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాలేదు.

– పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు, ఇబ్రహీంపట్నం డివిజన్

విత్తనాలు కొనుగోలు చేశా



ఉన్న నాలుగు ఎకరాల్లో పత్తిపంట సాగు చేయడానికి అవసరమైన విత్తనాలను కొనుగోలు చేశా. కొన్ని విత్తనాలకు సంబంధించి రసీదు కూడా తీసుకున్నాను. తొలకరి రాగానే పంటసాగు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– జంగయ్య, రైతు, అవురుపల్లి

విత్తనాలు, ఎరువులు రెడీ



విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. కొనుగోలుకు రైతులే ఇంకా రావడం లేదు. కొనుగోలు చేసిన విత్త నాలు, ఎరువులకు రసీదులిస్తున్నాం. వర్షాలు పడితేనే మా వ్యాపారం సాగేది.

– శ్రీనివాస్‌గుప్తా, రాఘవేంద్ర ఫర్టిలైజర్ యజమాని, ఇబ్రహీంపట్నం

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

- ఆత్మహత్యలు పరిష్కారం కాదు
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి ఆత్మహత్యలకు పరిష్కారం కాదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని రైతు కాలనీలో నివాసం ఉంటున్న డాక్టర్ బుచ్చిబాబు, అమృత దంపతుల కుమార్తె కీర్తి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట


కీర్తి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు, రాజుగౌడ్, అర్జున్‌కుమార్, లింగం తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన 'ధన్వంతరి'

వైద్యవృత్తిని చదువుతున్న కీర్తి ఆత్మహత్య చేసుకోవడంతో ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు రఘుపతినాయక్ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలోని చౌరస్తాలో కీర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు రంగయ్య, రాచప్ప, రవికుమార్, తిరుపతి, పద్మనాభం, యాదగిరి, ఆంజనేయులు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలో పడి వృద్ధుడి దుర్మరణం

శంకర్‌పల్లి: చెత్త పారబోయడానికి వెళ్లిన ఓ వృద్ధుడు నాలాలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జన్వాడ గ్రామానికి చెందిన నాంపల్లి మలక్కయ్య(60) వృద్ధాప్యం దృష్ట్యా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం చెత్త పారబోయడానికి ఆయన బయటకి వెళ్లాడు. ఇంటి పక్కనే ఉన్న ఫిరంగి నాలాలో ప్రమాదవశాత్తు కాలు జారి నాలాలో మల్కయ్య పడ్డాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకగా.. మధ్యాహ్నం ఫిరంగి నాలాలో శవమై తేలాడు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు.

ఎన్‌ఓసీ, ఫారం–35 లేకుండానే.. వాహన యజమాని పేరు మార్పు

ఆర్టీఓకు ఫిర్యాదు చేసిన బాధితుడు

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో ఓ వాహన యజమాని ప్రమేయం లేకుండానే మరో వ్యక్తి పేరుపై బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడ సూరజ్‌నగర్ కాలనీలో లింగపల్లి జగన్‌కు చెందిన ఇన్నోవా (టీఎస్ 07 జీహెచ్ 7101)ను తెలిసిన వ్యక్తికి విక్రయించాడు. సదరు వ్యక్తి డబ్బులు చెల్లించకపోవడంతో ఎన్‌ఓసీ లెటర్, ఫారం–35 జగన్ వద్దే ఉంచుకుని వాహనం ఇచ్చాడు. మిగిలిన డబ్బు ఇవ్వకపోవడంతో ఆన్‌లైన్‌లో చెక్ చేయగా వాహనం కొనుగోలు చేసిన వ్యక్తిపై బదిలీ అయింది. దీంతో శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నం ఆర్టీఓ సుభాష్ చంద్రారెడ్డికి ఫిర్యాదు చేశానన్నారు. ఇదే విషయమై ఆర్టీఓను సాక్షి వివరణ కోరగా పూర్తి విచారణ చేసి తప్పు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.


పోలీసులు సీజ్ చేసిన జేసీబీలు, డోజర్లు

వెంచర్ ధ్వంసంపై కేసు

- ప్లాట్ల కబ్జాకు యత్నం
- వాహనాలు సీజ్

నందిగామ: వెంచర్‌ను ధ్వంసం చేసిన పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు వాహనాలను సీజ్ చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని రంగాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. 2006లో రంగాపూర్ శివారు 320, 322, 324, 331 సర్వే నంబర్లతో పాటు మరికొన్ని భూములను కలిపి మెట్రోసిటీ పేరుతో గ్రీన్ హోం ఫామ్స్ అండ్ రిసార్ట్స్ హైదరాబాద్ సంస్థ సుమారు 100 ఎకరాలలో వెంచర్ వేసింది. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లికి చెందిన యర్రగుంట్ల పాపయ్య వెంచర్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. పెద్దమ్మ తండాకు చెందిన దేవేందర్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం దేవేందర్ వెంచర్ వద్దకు వెళ్లగా.. నాలుగు జేసీబీలు, నాలుగు డోజర్లు సుమారు రెండు ఎకరాల్లో ప్లాట్లను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వెంటనే ఆయన సూపర్‌వైజర్ పాపయ్యకు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని రెండు జేసీబీలను, రెండు డోజర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పాపయ్య ఫిర్యాదు మేరకు హాజీపల్లికి చెందిన దర్శన్‌తో పాటు రంగాపూర్‌కు చెందిన హనుమంత్‌రావు, విజయ్, చెన్నకేశవులుతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పహాడీషరీఫ్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి కమాన్ రోడ్డులోని ఆక్సిజన్ కంపెనీ సమీపంలో గురువారం సాయంత్రం స్థానికులు ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండడాన్ని గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా మృతిచెంది ఉన్నాడు. మృతుడి వయసు 45 ఏళ్లుగా ఉంటుందని, స్థానికంగా భిక్షాటన చేసేవాడని తెలిసింది. సకాలంలో తినకపోవడంతోనే అనారోగ్యం బారిన పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంబంధీకులెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఓటు వేసేందుకు వెళ్లి మహిళ అదృశ్యం


చందన (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఓటు వేసేందుకు సొంతూరుకు వెళ్తొస్తానని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం రాణీపేటకు చెందిన వడాల చందన(32) కొన్నేళ్ల క్రితం స్థానికంగా జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసముంటూ లేడీస్ కార్నర్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 13వ తేదీన సొంతూరు రాణీపేటలో ఓటు వేసేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


రామేశ్వర్ శివాజీ షిండే (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహారాష్ట్రలోని లింబా గ్రామానికి చెందిన రామేశ్వర్ శివాజీ షిండే (31) కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. ఉమర్‌ఖాన్‌గూడలో భార్య, పిల్లలతో ఉంటూ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న సాయంత్రం ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన రామేశ్వర్ రాత్రైనా ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన భార్య శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

వెటర్నరీ డాక్టర్‌కు గాయాలు

మొయినాబాద్: వెనుక నుంచి అతివేగంతో వచ్చిన కారు, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వెటర్నరీ డాక్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై గండిపేట చౌరస్తా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన వెటర్నరీ డాక్టర్ రామన్ సిద్ధార్థ శుక్రవారం మధ్యాహ్నం తన బైక్‌పై మొయినాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. గండిపేట చౌరస్తా వద్ద వెనుక నుంచి అతి వేగంతో వచ్చిన ఓ ఇన్నోవా, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రామన్‌సిద్ధార్థ రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం కాళీమందిర్ సమీపంలోని సాదన్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ గురునాయుడు, ఎస్‌ఐ వెంకటయ్య ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను నిలిపి తనిఖీలు చేశారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సహాయ నటిపై లైంగికదాడి

నటుడి కారు డ్రైవర్ సహా ఆరుగురి అరెస్ట్

అన్నానగర్ (చెన్నై): చెన్నైలోని వలసరవాక్కంలో ఇంట్లోకి చొరబడి ఓ సహాయ నటిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ నటుడి కారు డ్రైవర్ సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన 30 ఏళ్ల యువతి టీవీ సీరియల్స్‌లో సహాయ నటిగా నటిస్తోంది. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె చెన్నై వలసరవాక్కంలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఆమె బంధువు పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. సహాయనటి మాత్రమే ఇంట్లో ఒంటరిగా ఉంది. గురువారం రాత్రి తన ఇంట్లోకి ఆరుగురు వ్యక్తులు ప్రవేశించారు. వీరిలో మురుగేశన్ ఇద్దరిని బయట కాపలా పెట్టి సహాయ నటిపై లైంగిక దాడికి పాల్పడి, పరారైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై సహాయనటి వలసరవాక్కం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఘటనకు సంబంధించి మురుగేషన్, కల్యాణకుమార్, అరుణ్‌పాండి, మారియప్ప, పెరియనంబిరాజ్, ముప్పిడాదిని అరెస్టు చేసి విచారి స్తున్నారు. అరెస్టయిన మురుగేశన్ ఓ సినీ నటుడి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

చేవెళ్ల: గంజాయి అమ్మేందుకు వెళ్తున్న ఇద్దరు వలస కూలీలను శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వీరబ్రహ్మం తెలిపిన ప్రకారం.. గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్‌ఓటీ పోలీసులకు అందించిన పక్కా సమాచారం అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేశారు. వారి వద్ద 730 గ్రాముల గంజాయి పాకెట్లు లభించాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నహీర్‌మియా, నూర్ ఇస్లాం కూలీ పనులు చేస్తూ చేవెళ్లలో అద్దెకుంటున్నారు. వీరు గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి తెలిసినవారికి అమ్మేందుకు వెళ్తున్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


పోలీసుల అదుపులో వలసకూలీలు

నకిలీ విత్తనాల కేసులో ఐదుగురికి రిమాండ్

మాడ్గుల: రైతులను లక్ష్యంగా చేసుకొని నకిలీ విత్తనాలు విక్రయించి కాసులు దండుకొనే ముఠాపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. మండలంలోని కొత్త బ్రాహ్మణపల్లిలో బుధవారం నకిలీ విత్తనాలు పట్టుబడిన కేసుకు సంబంధించి మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని.. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు. కొత్త బ్రాహ్మణపల్లి గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం శంషాబాద్ ఎస్‌ఓటీ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి కిలోల పత్తి విత్తనాలు, ఐదు సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ కాంటా, ఓ కారును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దుగ్గిపూడి మర్రెడ్డి, అల్లం వినోద్‌కుమార్, అల్లం మర్రెడ్డిని అరెస్టు చేశారు. ఈ విత్తనాలు సరఫరా చేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన వైఎస్ సత్యపాల్‌రెడ్డి, కేశంపేట మండలం సుందరాపూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డిలను గురువారం అరెస్టు చేశామన్నారు. కర్ణాటకకు చెందిన కొండప్ప నాయుడు పరారీలో ఉన్నారని చెప్పారు.


పోలీసులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

సినీ పరిశ్రమలో అవకాశాలు రాక..

దొంగగా మారిన మేకప్ ఆర్టిస్ట్

బంజారాహిల్స్: సినిమాల్లో మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి కొంతకాలంగా పరిశ్రమలో అవకాశాలు దక్కక పొట్టకూటి కోసం దొంగతనాలకు పాల్పడుతూ కటకటాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే... శ్రీకృష్ణానగర్‌లో నివసించే పొట్లూరి చంద్రశేఖర్ మేకప్ ఆర్టిస్ట్‌గా సినీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గత నాలుగు నెలల నుంచి సినిమా షూటింగ్‌లు తగ్గిపోవడంతో అవకాశాలు రావడం లేదు. పూటగడవడమే కష్టంగా మారడంతో బయట దొంగతనం చేస్తూ ఆ సొత్తును విక్రయిస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. మే 25వ తేదీన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయివైన్స్ సమీపంలో ఓ స్కూటర్ దొంగతనం చేసి తనకు తెలిసిన రెడ్డి నాగవీర వెంకట సత్యనారాయణ వద్ద కుదువపెట్టాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ ఫుటేజీల ఆధారంగా చంద్రశేఖర్‌ను అరెస్టు చేశారు. తాను చోరీ చేసిన స్కూటర్లను సత్యనారాయణ వద్ద కుదువపెట్టడం గురించి చెప్పాడు. దీంతో ఇద్దరినీ అరెస్టు చేసి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపి బంజారాహిల్స్ డీఐ బషీర్ అహ్మద్, ఎస్‌ఐ కె.వెంకటేష్‌లను బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.


పొట్లూరి చంద్రశేఖర్


వెంకట సత్యనారాయణ

తాగుడు కోసం పసికందు కిడ్నాప్

దంపతులతో పాటు మరో మహిళ అరెస్ట్

శంషాబాద్: అమ్మ పొత్తిళ్లలో నిద్దురపోయిన నెలరోజుల పసికందును అపహరించి అమ్మేందుకు యత్నించిన దంపతులతో పాటు మరో మహిళను ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాగుడుకు బానిసైన దంపతులు ఈ దారుణానికి ఒడిగట్టారు. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు. కర్నూలుకు చెందిన చిన్నా, లక్ష్మి దంపతులు కుమార్తె అంజలి (5)తో పాటు నెలరోజుల పాపతో కలిసి పట్టణంలోని ఫ్లైఓవర్ కింద నివాసం ఉంటూ కూలి పనులు, చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 27వ తేదీ రాత్రి రోజూ మాదిరిగా తమ పనులు ముగించి ఫ్లైఓవర్ కింద నిద్ర పోయారు. అయితే రాత్రి 10:30 గంటల తర్వాత తల్లి పక్కనే ఉన్న చిన్నారిని మైలార్‌దేవ్‌పల్లి బృందావన్ కాలనీ చెందిన దంపతులు దండు హన్మంతురావు, చందనతో పాటు శంషాబాద్ సిద్ధాంతిలో నివాసముండే వారి బంధువు బొంగపాటి స్వాతిలు తీసుకుని అక్కడి నుంచి పారిపోయారు. కొద్దిసేపటి తర్వాత లేచిన తల్లిదండ్రులకు పాప కనిపించకపోవడంతో వెంటనే ఆర్‌జీఐ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు డీసీపీ రామకుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ బాలరాజు నేతృత్వంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి వెతకడం ప్రారంభించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పాపను కిడ్నాప్ చేసిన దంపతులతో పాటు మహిళను కూడా పోలీసులు గుర్తించారు. కిడ్నాపర్లు తాగుడుకు బానిసై డబ్బుల కోసం ఈ దుర్మార్గానికి ఒడిగట్టారు. పోలీసు బృందాలు శుక్రవారం ఉదయం శంషాబాద్ సిద్ధాంతి వద్ద పాపను కిడ్నాప్ చేసిన ముగ్గురిని అరెస్టు చేశారు. అనంతరం కిడ్నాప్‌కు గురైన పాపను అమ్మ ఒడికి చేర్చారు.

శంషాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ హల్‌చల్

ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం

శంషాబాద్: కారును రోడ్డుపై అడ్డంగా పెట్టడమే కాకుండా ట్రాఫిక్ పోలీసులతో క్యాబ్ డ్రైవర్ వాగ్వాదానికి దిగిన సంఘటన శంషాబాద్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలో కరాచిబేకరి ముందు శు క్రవారం మధ్యాహ్నం ఓ క్యాబ్ డ్రైవర్ రోడ్డుపై క్యాబ్‌ను నిలపడంతో ట్రాఫిక్ పోలీసులు అతడిని కారు అక్కడి నుంచి తీయాల్సిందిగా సూచించారు.కారు తీయకపోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతోపాటు మరో పోలీసుపై దాడికి యత్నించాడు. దీంతో కొన్ని నిమిషాల పాటు రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. క్యాబ్ డ్రై వర్ వివరాలు తీసుకుని అతడిపై ఆర్‌జీఐఏ పోలీసులకు ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.